ప్రజాశక్తి

గురువారం 29 ఆగస్టు 2024

30న విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి -పాడేరు : జిల్లాలోని పలు మండలాల్లో ఈనెల 30న శుక్రవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్స్ మరమతుల నిమిత్తం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏవి ఎస్ ఎం.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ముంచింగిపుట్టు సబ్ స్టేషన్ 11కేవీ పెదగూడ ఫీడర్ పరిధి గ్రామాలు బాకులపుట్టు, చుట్టమూరుపుట్టు, కొండపాడు, పెదగూఢ గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. చింతపల్లి సబ్ స్టేషన్ 11 కేవీ లోతుగెడ్డ ఫీడర్ పరిధి గ్రామాలు లోత్తుగెడ్డ జంక్షన్, చినగెడ్డ, వంగసార గ్రామాలకు, కొయ్యూరు మండలం కాకరపాడు సబ్ స్టేషన్ 11కేవీ కొయ్యూరు టౌన్ ఫీడర్ పరిధి గ్రామాలు కాకర్పాడు, సింగవరం, రాజేంద్రపాలెం, కొయ్యూరు గ్రామాలకు, అనంతగిరి మండలం భీమవరం సబ్ స్టేషన్ 33కేవీ ఫీడర్ మరమతుల నిమిత్తం సబ్ స్టేషన్ పరిధి గ్రామాలు భీమవరం, గుమ్మకోట, భీంపోల్, ఊటగెడ్డ, గరుగుపల్లి గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు.

అర్హులైన డ్వాక్రా సంఘాలకు

రుణ సౌకర్యం కల్పించాలి

-ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అర్హులైన డ్వాక్రా సంఘాలకు రుణ సౌకర్యం కల్పించాలని బుధవారం ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన డ్వాక్రా సంఘం మహిళలు మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బుజ్జిబాబు, చిన్నబాబు మాట్లాడుతూ, మండలంలోని సుంకరమెట్ట పంచాయితీ పరిది గ్రామాలైన పెద్దగంగుడి, సంఘంవలస, దాబుగుడ, సుంకరమెట్ట, పిరిబంద, బంగ్లావలస తదితర 9 గ్రామాలకు చెందిన 137 డ్వాక్రా సంఘాలకు రుణ సౌకర్యాలు కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. టిపిసిపి రుణం ఒక్కొక్క సభ్యులు 50వేలు తీసుకున్నారని, సభ్యులు చెల్లించారని, వీవోఏ తన సొంత అవసరాల కోసం వాడుకున్నారని విమర్శించారు. అతని నుండి రిక్వైరీ చేసి వివోఏ రుణ ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తున్న వివోఎపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఈ సందర్భంగా ఏపిఎం శెట్టి అప్పయ్యమ్మ మాట్లాడుతూ, సభ్యులు ఎవరు ఆందోళన చెందాల్సిన పని లేదని, అర్హులైన ప్రతి డ్వాక్రా సంఘాలకు అవసరమైన బ్యాంక్ లింకేజి, వివిద రకల రుణాలు అందిస్తామన్నారు. కొన్ని రోజుల నుండి సక్రమంగా నడిపించకుండా మద్యంతరంలో వదిలేయడంతోనే కొంత మేరకు రుణాలు మంజూరు చేయడంతో ప్రభుత్వం నిలుపుదల చేసిందన్నారు. సంఘాలు సజావుగా నడిచే విధంగా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. గ్రామఖ్య సంఘాలకు అవసరమైన రుణా సౌకార్యం అందించేందుకు ప్రతిపాధనలు పంపించామన్నారు. టిపిసిపి రుణాలు తీసుకున్న ప్రతి ఒక్క సభ్యులు సకాలంలో చెల్లించే విధంగా వెలుగు సిబ్బంధి గ్రామాల్లో అవగాహన కార్యక్రమలు నిర్వహించనున్నామన్నారు. కొంతమంది వీవోఏల తప్పిదాలతో కొంతమేరకు రుణాలు ఆలస్యం అయ్యిందన్నారు.

నినాదాలు చేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు, డ్వాక్రా మహిళలు

ఇక్కపై ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వెలుగు అధికారులు ఏపిఎం, సీసీలు జోక్యం చేసుకొని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు కె.రామారావు, జగ్గన్నాధం, సుంకరమెట్ట ఉపసర్పంచ్ బురిడీ ఆశలత, బిమల రత్నాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతల నుండి

ఉపాధ్యాయులకు విముక్తి కల్గించాలని వినతి

ప్రజాశక్తి-కూనవరం

పాఠశాలల్లో మరుగుదొడ్ల ఫొటోల బాధ్యతల నుండి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) కూనవరం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మండల విద్య వనరులు కేంద్రంలో కంప్యూటర్ ఆపరేటర్ సత్యవతికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.నాగేశ్వరరావు, పి.కన్నారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేసి బోధనకు మాత్రమే పరిమితం చేయాలని కోరారు. మరుగుదొడ్ల ఫొటోలు ఎస్ఎంసి చైర్మన్, సభ్యులు, గ్రామ సచివాలయ అసిస్టెంట్ల చేత తీయించాలని, ప్రతి రోజూ సాయంత్రం 3 నుండి 3.30 గంటల లోపు పది అంశాలతో కూడిన గూగుల్ ఫారం పూర్తి చేసి ఉపాధ్యాయలు అప్‌లోడ్ చేయాలని ఉత్తర్వులు జారీ చేయడాన్ని యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల కోశాధికారి యం.రాంబాబు, కట్టం మహేష్, జి.నాగదుర్గ, ప్రియాంక, సత్యవతి, శాంతి, మహాతి, ధనలక్ష్మి, వేటగాని లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా డల్లాపల్లి అభివృద్ధికి చర్యలు

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్-రహదారి విస్తరణ పనులు పరిశీలన

ప్రజాశక్తి-పాడేరు : డల్లాపల్లి పర్యాటక కేంద్రాన్ని మరింత అభివృద్ధి చేసి సందర్శకులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. బుధవారం అమ్మవారి పాదాల నుండి డల్లాపల్లి వరకు 5.50 కిలోమీటర్ల మేర జరుగుతున్న రహదారి విస్తరణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతమున్న 3.75 మీటర్ల వెడల్పు ఉన్న రహదారి పర్యాటకులకు అనుకూలంగా లేనందున, ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున రెండు వైపులా మరో 3.75 మీటర్ల వెడల్పు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులను ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టినట్లు తెలిపారు. ఈ రహదారి మరో నెల రోజులలో పూర్తి కావచ్చని, పెరిగే పర్యాటకులకు అనుకూలంగా డల్లాపల్లిలో ఐదారు హోంస్టేలు నిర్మించడానికి ముందుకు వస్తే సహకారం అందిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా ట్రెక్కింగ్, పారా గ్లైడింగ్ లాంటి అడ్వంచర్ గేములు ఏర్పాటుకు ముందుకు వస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని వివరించారు. వంజంగి పర్యాటక కేంద్రంలో అమలు చేస్తున్న విధంగా ఇక్కడ కూడా శాఖా పరంగా అధికారితో పాటు గిరిజనులు బృందంగా ఏర్పడి పర్యాటకాన్ని అభివృద్ధి దిశలో నడిపించాలని కోరారు. వంతాడిపల్లి నుండి బూరుగుచట్ట, సప్పిపుట్టు నుండి నారింగాపాడు వరకు సుమారు 9.50 కిలో మీటర్ల రహదారిని బిటి రహదారిగా మారుస్తూ చేపట్టిన పనులను కలెక్టర్ పరిశీలించారు. రూ.6.40 లక్షల ఉపాధి హామీ నిధులతో చేపట్టిన 3.75 మీటర్ల వెడల్పు గల ఈ రహదారితో అల్లివరం, రనంబడి, సప్పిపుట్టు, బూరుగుచట్ట, వంతాడిపల్లి పివిటిజి గ్రామాలలోని 1200 మంది జనాభాకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ పర్యటనలో ఎంపిడిఓ సాయి నవీన్, పంచాయతీరాజ్ ఇఇ కొండయ్య పడాల్, ఇంజినీరింగ్ సహాయకులు రాజా తదితరులు పాల్గొన్నారు.

డల్లాపుట్టు కొండ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

అక్రమ నిర్మాణాలపై సహించేది లేదు

-మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు బినామీ పేరుతో అక్రమ నిర్మాణాలకు ప్రోత్సహిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని ఎమ్మెల్యే రేగం మత్స్య లింగం హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి ఈశ్వరి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ, మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసుకోవాలని సూచించారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యావ్యవస్థ చాలా అధ్వానంగా ఉందని, విద్యాబోధన తో పాటు భోజనం కూడా సక్రమంగా అమలు కాలేదని తెలిపారు. విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలకు తీర్మానం చేసి ఉన్నత అధికారులకు నివేదించాలని ఎంపిడీవోను ఆదేశించారు. స్థానికంగా నిత్యావసర సరుకులు ధరలు తగ్గించే విధంగా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. గసభ పంచాయితీ గ్రామాల్లో పోడు వ్యవసాయం సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న గిరిజనులకు పోటుపట్టాలను మంజూరు చేయాలని ఆ పంచాయతీ సిపిఎం సర్పంచ్ పి.సునీత కోరారు. కంద్రుము పంచాయతీ గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న గ్రావిటీ పథకాలు పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను నిలదీశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సిహెచ్ జానకమ్మ, వైస్ ఎంపీపీలు ఆనంద్, లలిత, ఎంపీడీవో ఉషారాణి, తహసిల్దార్ నాగమ్మ, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి

డుంబ్రిగుడ: సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి వ్యాధుల అదుపునకు చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సందర్శించి గిరిజనులకు అందిస్తున్న వైద్య సేవలపై వైద్యాధికారితో అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజన మెనూను పరిశీలించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు బోధిస్తున్న బోధన తీరుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న భోజన మెనూను కచ్చితంగా అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎఎన్ఎం, ఉపాధ్యాయురాలి వేధింపులపై

సర్పంచ్‌కు గిరిజన విద్యార్థినుల ఫిర్యాదు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

మండలంలోని బోదులూరు గిరిజన ఆశ్రమ బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో స్థానిక ఎఎన్ఎం రామలక్ష్మి, ఉపాధ్యాయురాలు మంగమ్మ తమను తీవ్రంగా వేధిస్తున్నారని, తమ చేత వెట్టి చాకిరీ చేయిస్తున్నారని ఆ పాఠశాలకు చెందిన గిరిజన విద్యార్థినులు మంగళవారం ఆ పంచాయతీ సర్పంచ్ డి.ప్రేమలతకు ఫిర్యాదు చేశారు. తామర, గజ్జి ఉందన్న నెపంతో విద్యార్థినుల వస్త్రాలను విప్పించి ఇనుప గొట్టాలు, బెత్తాలతో కొడుతున్నారని, తమతో వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని గిరిజన బాలికలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ తల్లిదండ్రులను సైతం విమర్శిస్తూ, మీరు కొండల్లో పుట్టి, చేతబడి కలిగిన వారని, చదివి ఏం సాధిస్తారు? అంటూ విద్యార్థులను నిరుత్సాహపరుస్తూ, అసభ్యకర పదజాలంతో తిడుతున్నారని వాపోయారు. పడుకునే సమయంలో వారి కాళ్లు నొక్కాలని, వారి నివాస గృహాల్లో అంట్లు తోమడం, బట్టలు ఉతకడం వంటి పనులు చేయించుకుంటున్నారని తెలిపారు. దీనిపై ప్రధానోపాధ్యాయులు దృష్టికి తీసుకెళ్లానా, తమకు ఎఎన్ఎం రామలక్ష్మి, ఉపాధ్యాయురాలు మంగమ్మ వద్దని విన్నవించినా హెచ్ఎం ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమను వేధిస్తున్న ఎఎన్ఎం, ఉపాధ్యాయురాలిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత విద్యార్థినులు సర్పంచ్‌ను వేడుకున్నారు. దీనికి స్పందించిన సర్పంచ్ ప్రేమలత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని చెప్పారు.

బురదగా ఉన్న డి.కొత్తూరు గ్రామం రోడ్డు

డి.కొత్తూరు వీధులన్నీ బురదమయం

సిసి రోడ్లు నిర్మించాలని గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి -సీలేరు

జికె.వీధి మండలం దారకొండ పంచాయతీ పరిధి దారకొండ కొత్తూరు గ్రామ వీధులు ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయంగా మారాయి. దీంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దారకొండ కొత్తూరు గ్రామంలో సుమారు 60 కుటుంబాలకు చెందిన 450 నుంచి 500 మంది జనాబా నివసిస్తున్నారు. గ్రామానికి మూడు నాలుగు వీధులు ఉన్నాయి. ఏ ఒక వీధికి సిసి రోడ్డు లేదు. భారీ వర్షాలు కురిస్తే వీధులన్నీ వరదమయంగా మారుతుతున్నాయి. ఆ సమయంలో ఇంటి నుంచి బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, దారకొండ గ్రామపంచాయతీ పాలకవర్గం స్పందించి డి.కొత్తూరులో సిసి రోడ్లు వేసే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

కింజేరులో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని రంగిలిసింగి పంచాయతీ కింజేరు గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కింజేరు, కూడబీర్, రంగిలిసింగి, కుజబంగి గ్రామాలతో పాటు గుంటసీమ, గుంటగన్నేల పంచాయతీ పలు గ్రామాల నుంచి జలుబు ,దగ్గు, తలనొప్పి, జ్వరం, చర్మ వ్యాధులుతోపాటు వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న సుమారు 200 మంది గిరిజనులు శిబిరంలో పాల్గొని వైద్య సేవలు చేయించుకున్నారు. వీరికి స్థానిక డుంబ్రిగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి పిరాంబాబు వైద్య సేవలు అందించి మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాకాల వాతావరణంలో జలుబు, దగ్గు, జ్వరంతో పాటు టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, ప్రతిరోజు కాచి చల్లార్చిన వేడి నీటిని ఉపయోగించాలని కోరారు. పశువుల శాలలను కూడా శుభ్రపరుస్తూ ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.సూర్యనారాయణ, మండల నాయకుడు పి.దొంబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

పోలీసుల దాడుల నుండి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి- అల్లూరి డెస్క్ : పోలీసుల దాడుల నుంచి గిరిజనులకు రక్షణ కల్పించాలని ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం ప్రజాప్రతినిదులు కోరారు. ముంచంగిపుట్టు మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయితీ కేంద్రం బుంగపుట్, లక్ష్మీపురం పంచాయితీ ముఖ్య మైన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఎంపీటీసీ కొర్రా త్రినాధ్, వి.సాధురం మాట్లాడుతూ, గత ఆరు నెలల క్రితం ఇదే మాదిరిగా పోలీసులు గిరిజనులపై దాడులు చేస్తే మండల కేంద్రంలో నిరసన తెలియజేయడం జరిగిందన్నారు. అప్పట్లో పోలీస్ ఉన్నతాధికారులు ఇచ్చిన హామీని నిలబెట్టు కోలేదన్నారు. బయట నుండి ఎవరూ వచ్చినా స్థానిక ఎస్ఐ రవీంద్ర సమక్షంలో అర్ధరాత్రి ఇంట్లో దూరి బలవంతంగా దాడులు చేస్తున్నారన్నారు. ఈ దాడి విషయం బయట పెడితే అక్రమ కేసులు పెట్టి జైల్లో పెడుతున్నారన్నారు. మీడియా, ప్రజాప్రతినిధులకి చెపితే బెదిరిస్తున్నారన్నారు. రక్షణగా ఉండవలసిన పోలీసులు దాడులు చేస్తుంటే గిరిజనుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా దాడులు విరమించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పి స్పందించి పోలీసుల దాడి నుండి గిరిజనులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు ఎస్.సోద త్రినాధ్, హరి, గ్రామస్థులు ధనుజ్రయ్, నిరీక్రిష్ణ, సుబ్బారావు, గురుమూర్తి, ప్రసాద్, సీతారామ్ పాల్గొన్నారు.

పోలవరం నిర్వాసితుల సమస్యలను పరిష్కరించండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-ఎటపాక

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై దృష్టి సారించి లక్షా 6 వేల కుటుంబాలకు చట్ట ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ సమగ్రంగా అమలు జరపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. మండలంలోని నందిగామలో సిపిఎం ఎటపాక, కూనవరం మండలాల ఆగ్జలరీ సభ్యుల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం ప్రాజెక్ట్ నిర్మాణం గురించి కమిటీలు, కాంట్రాక్టల గురించే మాట్లాడుతున్నాయి తప్ప నిర్వాసితుల సమస్యలపై అసలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి నిర్వాసితులకు చెల్లించాల్సిన పరిహారం తీసుకురావడం లేదన్నారు. ఎనిమిది నిర్వాసిత మండలాల్లో ముఖ్యమంత్రి క్షేత్రస్థాయి పర్యటన చేసి నిర్వాసితుల దయనీయ పరిస్థితులను కళ్లారా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఏటా వరదలలో వేలాది నిర్వాసిత కుటుంబాల వారు పంటలు, ఇళ్లు, పశువులు, ఇతర ఆస్తులను కోల్పోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యుద్ధ ప్రాతిపదికన నిర్వాసితుల సమస్యలను సమగ్రంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వరదల అనంతరం రైతంగం వ్యవసాయ పనులు ప్రారంభించారని, వారికి సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందజేయాలని, వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు, గ్రామీణ పేదలకు పనులు లేని కాలంలో రెగ్యులర్‌గా ఉపాధి హామీ పనులు చూపించాలని, కనీసం రోజు కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి ఐవి, నాయకులు ఆకిశెట్టి రాము, ఐ.పద్మ, సోందే రామారావు, కాకా అర్జున్ దొర, సోయం వీరమ్మ, పులుసు బాలకృష్ణ, జి హుస్సేన్, బండారు భరణి కుమారి, కందుల సతీష్, పొడియం రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- బకాయి వేతనాలు చెల్లించాలి
- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

ప్రజాశక్తి-చింతూరు

రాష్ట్రంలోని గ్రామ, వార్డు వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. గ్రామవాలంటీర్ల సమావేశం బుధవారం చింతూరు సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ ఎన్నికల్లో టిడిపి కూటమి ఇచ్చిన హామీ మేరకు రూ.10వేలు వేతనం చెల్లించాలని కోరారు. వైసిపి నేతల ఒత్తిడి మేరకు రాజీనామా చేసిన వారిని తిరిగి వీధుల్లోకి తీసుకోవాలన్నారు. వాలంటీర్ల విధి విధానాలు, జాబ్‌చార్ట్ ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, అందువల్లే రూ.5వేలు, రూ.10వేలు గౌరవ వేతనానికి కూడా పనిచేయడానికి చదువుకున్న నిరుద్యోగులు పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. సిఐటియు మండల కార్యదర్శి పొడియం లక్ష్మణ్ మాట్లాడుతూ వాలంటీర్ల సమస్యలపై సెప్టెంబర్ 6న మండల స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని, మండలంలోని వాలంటీర్లందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ,వార్డ్ వాలంటీర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు పోడియం జానీ, కలముల మహేష్, కట్టం సింగయ్య, సాదుల రామిరెడ్డి, వేక శేఖర్, సవలం ఉదయ్, సోయం రాజ్ కుమార్, రవ్వ అంజి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్

ప్రజాశక్తి

ఉద్యోగ విరమణ మరియు షష్ఠిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.

మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు

మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.

ఉద్యోగ విరమణ

షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు

మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		

అరకులోయలో కుండపోత వర్షం

అరకులోయలో కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి-అరకులోయ: పర్యాటక కేంద్రమైన అరకులోయ పరిసర ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం కుండ పోత వర్షం కురిసింది. గాలి వాన పిడుగులతో కూడిన వర్షం కురవడంతో ఈ ప్రాంత వాసులు తీవ్ర ఆందోళన గురయ్యారు. బుధవారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షాలకు అరకు -విశాఖ ఘాట్ రోడ్డులో వర్షపు నీరు పారి జల మయమైంది. తదీంతో, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత కొద్దిరోజులుగా వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ఊపిరి పీల్చుకున్న ఈ ప్రాంత వాసులకు గాలివానతో కూడిన కుండపోత వర్షం కురవడంతో భయాందోళనకు గురయ్యారు. ఘాట్ రోడ్డులో ప్రయాణిస్తున్న వాహనదారులు వర్షాలకు ఎక్కడ తలదాచుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. రోడ్లపై వరద నీరు పారి అస్తవ్యస్తంగా తయారై నీటి కాలువలను తలపింపజేసింది. దీంతో పాటు చలికాలాన్ని తలపించే విధంగా దట్టమైన మంచు కమ్ముకోవడంతో వానదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి- పెదబయలు: మండలంలో విధులు నిర్వర్తిస్తున్న వెలుగు విఓఎలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరు నెలలుగా బకాయి పడ్డ వేతనాలు విడుదల చేయాలని వెలుగు విఓఎల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె,వెంకటరమణ, వరలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలు మంజూరు కాక చాలీ చాలని వేతనాలతో కుటుంబ సభ్యులు పోషణ చేసుకొంటున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి వేతనాలు తక్షణమే విడుదల చేయకపోతే విధులు బహిష్కరించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు

విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి -పాడేరు : విద్యార్థి దశ నుంచి వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి . జమాల్ బాషా తెలిపారు. బుధవారం జిల్లా స్థాయిలో చదువుతున్న 8,9 తరగతుల విద్యార్థులకు యూత్ ఫెస్ట్ కార్యక్రమంలో భాగంగా క్విజ్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలో విజేతలైన స్కూల్ విద్యార్థులకు ఆయన బహుమతులు అందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ప్రసాద్ పాల్గొన్నారు.

మైనింగ్‌పై జనాగ్రహం

- ప్రజల వ్యతిరేకతతో నిలిచిపోయిన ప్రజాభిప్రాయసేకరణ
- అనుమతులు రద్దు చేసే వరకూ పోరాడతాం : గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, ఆనందపురం

కుసులవాడ కొండపై మైనింగ్‌తో తమ జీవనోపాధికి ప్రమాదం వాటిల్లుతుందని, బ్లాస్టింగ్ చెయ్యం అంటూ నోటి మాట ద్వారా చెబుతూనే నివేదికలో బ్లాస్టింగ్ చేస్తున్నట్లు పేర్కొనడం చూస్తే తమనే కాదు అధికార యంత్రాంగాన్ని మైనింగ్ అనుమతులు పొందిన విఆర్ ఇన్‌ఫ్రా టెక్నాలజీస్ వారు మోసం చేశారంటూ గ్రామాలకు చెందిన ప్రజలు, రైతులు, మహిళలు బుధవారం తిరగుబాటు చేశారు. పరిస్థితి విషమించక ముందే ప్రజాభిప్రాయ సేకరణ తంతును రద్దుచేయాలని జిల్లా అధికారులు నిర్ణయించడం కనిపించింది. భీమునిపట్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ మైనింగ్‌పై ఇంతవరకూ నోరెత్తి మాట్లాడకపోవడం వెనుక ఈ గ్రామాల ప్రజల్లో ఈ పబ్లిక్ హియరింగ్ సందర్భంగా చర్చించుకోవడం కనిపించింది. ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (ఇఐఎ) నివేదికను అస్సలు తాము అంగీకరించబోమని మైనింగ్ అనుమతులను రద్దు చెయ్యాలని చిన్నయ్యపాలెం, ఇచ్చాపురం, కుసులవాడ తదితర గ్రామాల ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున తిరగబడ్డారు. గందరగోళం మధ్య జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, విశాఖ జిల్లా ఆర్‌డిఒ

మైనింగ్‌పై జనాగ్రహం

హుస్సేన్, కాలుష్య నియంత్రణ అధికార్లు తమలో తాము వేదికపై చర్చించుకున్నారు. ఆ తర్వాత మైనింగ్‌పై ప్రజాభిప్రాయసేకరణను రద్దుచేస్తున్నామని జాయింట్ కలెక్టర్ ప్రకటించారు. దీంతో ప్రజలు శాంతించారు. ఆనందోత్సాహాలతో నినాదాలు చేశారు.

నెల రోజులుగా ప్రజాశక్తిలో వరుస కథనాలు...

ఈ ఏడాది జులైలో 27న కుసులవాడ కొండపై జిల్లా కలెక్టర్, భీమిలి ఆర్‌డిఒ, జిల్లా అటవీ అధికారి, పరిశ్రమల మేనేజర్, జియాలజీ, ఆనందపురం తహశీల్దార్లకు పై నుంచి వచ్చిన లిఖిత పూర్వక ఆదేశాలను సేకరించిన ప్రజాశక్తి దినపత్రిక ఇక్కడ మైనింగ్‌కు సన్నాహాలు చేస్తున్నారన్న అంశాలను వరుస కథనాల ద్వారా ఆనందపురంలోని పలు గ్రామాల ప్రజలకు సమాచారం అందించింది. ఆనాటి నుంచి సిపిఎం విశాఖ జిల్లా నేతలు ఈ ప్రాంతంలో పర్యటనలు చేస్తూ మైనింగ్ చర్యలను ప్రభుత్వం నిలుపుదల చేసి 54 గ్రామాలకు చెందిన ప్రజల జీవనాన్ని కాపాడాలంటూ పలు ఆందోళనలను చేపట్టింది. మైనింగ్ పై సమాచారం పోగు చేసుకుని వరుస కథనాలను ప్రజాశక్తి ప్రచురణ చేసింది.

ఇది ప్రజా విజయం : సిపిఎం

విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లా ఆనందపురం మండలం కుసులువాడ మైనింగ్ ప్రజాభిప్రాయంపై ప్రజల తిరుగుబాటుతో రద్దు చేయడం ప్రజా విజయం అని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జివిఎంసి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అన్నారు. జగదాంబ సమీపంలోని సిపిఎం కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, మైనింగ్‌పై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు వ్యతిరేకంగా ప్రజలు తీవ్ర తిరుగుబాటు చేశారన్నారు. దీంతో జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం క్వార్ట్ జెట్ మైనింగ్ ఖనిజ తవ్వకాల లీజు ప్రతిపాదనలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన వైఖరిని వెంటనే ప్రకటించాలని, ప్రజల పక్షాన నిలబడాలని విజ్ఞప్తి చేశారు. తొలుత ప్రాజెక్టుపై పర్యావరణ ప్రభావ అంచనా తయారుచేసిన ఇహెచ్‌ఎస్ 360 ల్యాబ్స్ యొక్క ప్రతినిధి ప్రాజెక్టుపై పర్యావరణ ప్రభావ అంచనా నివేదికలో పేర్కొన్న అంశాలను కప్పిపుచి బ్లాస్టింగ్ జరపరని, కేవలం ఓపెన్ మైనింగ్‌లో గ్రావెల్ మాత్రమే తవ్వుతారని అబద్ధాలు చెప్పటంతో సిపిఎం నాయకులు అడ్డు తగిలి అధికారిని నిలదీసినట్లు తెలిపారు. దీంతో ఖంగు తిన్న అధికారి మళ్లీ సభను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నం చేశారని, సిపిఎం నాయకులు నివేదికలో ఉన్న అంశాలను బహిరంగపర్చడంతో ప్రజలందరూ అందోళనకు దిగారన్నారు. జిల్లా జాయింట్ కలెక్టరు, పొల్యూషన్ అధికారులను ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని, మైనింగ్ లీజును పూర్తిగా రద్దు చేయాలని ప్రజలందరూ ముక్త కంఠంతో ముందుకు దూసుకొచ్చి ప్రజాభిప్రాయ సేకరణను జరగనీయకుండా అడ్డుకున్నారని వివరించారు. దీంతో అనివార్యంగా జాయింట్ కలెక్టర్ ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేస్తూ ప్రకటన చెయ్యాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రజాగ్రహాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం గౌరవించి మైనింగ్ లీజు ప్రతి పాదనను పూర్తిగా రద్దు చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.

క్వార్ట్ జెట్ మైనింగ్‌పై మొదటి నుంచి రాష్ట్ర ప్రభుత్వ వైఖరి అనేక అనుమానాలకి తావిస్తుందన్నారు. పర్యావరణ ప్రభావ నివేదికను కుసులువాడ గ్రామ సచివాలయంలో పెట్టలేదన్నారు. పొల్యూషన్ కంట్రోల్ వెబ్‌సైట్ లో కూడా పెట్టలేదని తెలిపారు. ప్రజాభిప్రాయ సేకరణ తేదీని కూడా చుట్టూ ఉన్న గ్రామ ప్రజలకు తెలియజేయలేదన్నారు. అత్యంత రహస్యంగా ఈ తంతు కొనసాగించి కాంట్రాక్టర్ కు కట్టబెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేసిందని విమర్శించారు. వాస్తవంగా కుసులువాడ క్వార్ట్ జెట్ మైనింగ్‌ను 2022లో వైసిపి ప్రభుత్వం విఆర్ ఇన్ ఫ్రా సంస్థకు 20 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వాలని రహస్యంగా అనుమతిచ్చిందని గుర్తు చేశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజాభిప్రాయ సేకరణ చేసి ఈసంస్థకు ఇవ్వాలని తీవ్ర ప్రయత్నం చేయడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. మైనింగ్‌పై జరిగే నష్టాలను వివరించారు.

మధ్యాహ్న భోజన మెనూ సక్రమంగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

విద్యార్థులతో భోజనం చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు: మధ్యాహ్న భోజన పథకంలో మెనూ అమలు సక్రమంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం పాడేరు మండలం అల్లివరం మండల ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఇటీవల జరిగిన బేస్ లైన్ ఎగ్జామ్ ఫలితాలను పరిశీలించిన కలెక్టర్ సి గ్రేడ్ లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించిన కలెక్టర్ వాటి తలుపులు రిపేర్ చేపించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ సరస్వతి పాల్గొన్నారు.

ట్యాంక్ ఎత్తు పెంచడానికి ప్రతిపాదనలు

పాడేరు మండలం తుంపాడ గ్రామంలో అమృత్ సరోవర్ పథకం కింద నిర్మించిన నీలగెడ్డ చెరువును, ట్యాంకును జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, తుంపాడ దిగువ గ్రామాలకు తాగు నీరు సరఫరాకు గల అవకాశాలను పరిశీలించాలని ఎంపిడిఓను ఆదేశించారు. ఆ చెరువులో పూడిక తీతలు, బండ్ అభివృద్ధికి ఉపాధి హామీ పథకం కింద చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో ట్యాంక్ పైన ఉన్న చెరువు గట్లు తెగిపోవడంతో ట్యాంక్ దెబ్బ తిందని, దీని ఎత్తు పెంచడంతో మరికొన్ని ఎకరాలకు సాగు నీరు లభిస్తుందని తెలిపారు. చెక్ డ్యాం ఏర్పాటు చేయాలని స్థానిక సర్పంచ్ అడపా సూర్యకాంతం కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా ఆయన స్పందిస్తూ... ప్రతిపాదనలు పంపిస్తే మూడు లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సాయి నవీన్, సర్పంచ్ ఎ.సూర్యకాంతం, ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఎపిఒ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు

బేస్‌లైన్ పరీక్షలతో లోపాలను గుర్తించాలి

విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన బేస్ లైన్ పరీక్షల్లో వారిలో ఉన్న లోపాలను గుర్తుంచి సరిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఉపాధ్యాయులను ఆదేశించారు. పాడేరు మండలం కోట్ల గరువు గ్రామంలో ఐదు లక్షల రూపాయలతో పున: నిర్మించిన ప్రాథమిక పాఠశాల భవనాన్ని స్థానిక శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వరరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, విద్యార్థులను ఉన్నతవంతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామానికి మౌలిక సదుపాయాలు లేకపోయినా పర్వాలేదని, పిల్లలకు పాఠశాల ముఖ్యమని గ్రామస్తులు తీర్మానించుకుని పాఠశాల పునర్నిర్మాణానికి ముందుకు రావడం సంతోషదాయకమన్నారు. గ్రామస్తులే ప్రణాళికతో ముందుకు వచ్చి వారు కోరుకున్న పని చేయించుకున్నప్పుడు వారిలో ఉన్న పట్టుదల దేనికి తీసి రాదని అన్నారు. తల్లిదండ్రులు పేరెంట్స్ మీటింగ్‌కు హాజరై పిల్లల్లో నమ్మకాన్ని, సత్ప్రవర్తనను అభివృద్ధి చేయాలని సూచించారు. జిల్లాలో నాలుగో పాఠశాలలకు భవనాలు లేని పరిస్థితులు ఉన్నాయని, వాటి నిర్మాణానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించామని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామానికి అవసరమైన రహదారులు, కాలువలు, కల్వర్లను ఎన్‌ఆర్‌ఈజీఎస్ మెటీరియల్ కాంపోనెంట్ కింద చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. స్థానిక పాడేరు శాసనసభ్యులు మచ్చరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ, గ్రామంలో పాడైపోయిన పాఠశాల భవనాన్ని పున:నిర్మించడం సంతోషకరమన్నారు. పాడేరు డివిజన్లో 11 మండలాలలో మారుమూల గ్రామాలలో చదువుకోవడానికి పిల్లలు ఉన్నప్పటికీ పాఠశాలలు లేని పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా మారుమూల గ్రామాలలో పాఠశాలలకు ఒక వాలంటీర్‌కు అప్పగించి ఉపాధ్యాయులు హాజరు కాలేదని ఆరోపించారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు కలెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీపీ, సర్పంచులు సంతకాలు చేసిన నోటు పుస్తకాలను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పాడేరు ఎంపీపీ ఎస్ .రత్నకుమారి, ఎంపీడీవో సాయి నవీన్, ఎంఈఓ సరస్వతి, సర్పంచ్ రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంపై ఆరా

ప్రజాశక్తి- చింతపల్లి : మండలంలోని చౌడుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం (మిడ్ డే మీల్స్) పై స్థానిక తహసిల్దార్ రామకృష్ణ బుధవారం విచారణ నిర్వహించారు. ఈ పాఠశాలలో మిడ్ డే మీల్స్ సక్రమంగా అమలు కాలేదనే ఆరోపణలపై విచారణ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్ చాలా కాలంగా గుడ్లు ఇవ్వలేదని, గ్యాస్ పొయ్యి లేకపోవడతో వంట కష్టమవుతుందని తన దృష్టికి రావడంతో విచారణ నిర్వహించవలసి వచ్చిందన్నారు. తన విచారణలో ఈ విషయాలన్నీ నిజమని నిర్ధారణ అయ్యాయన్నారు. ఇకపై అటువంటి పరిస్థితులు తలెత్తకుండా నూతన కమిటీ ఎంపిక విషయమై తల్లిదండ్రులు కమీటీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడిని, విద్యా కమిటీ ఛైర్మన్ ను ఆదేశించడం జరిగిందన్నారు.

విద్యార్థులను ఆరా తీస్తున్న తహశీల్దార్

ఉమ్మిడివరంలో గ్రామసభ

గ్రామసభలో పాల్గొన్న సర్పంచ్ సరోజిని, గ్రామస్తులు

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి గ్రామ పంచాయతీ పరిధి ఉమ్మిడివరం గ్రామం, రెడ్డి గుంపులో సర్పంచ్ పూనెం సరోజిని అధ్యక్షతన బుధవారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రేషన్ కార్డులు, పింఛన్లు ఇతర సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కొత్తగా పెళ్లయిన వారు, కొత్తగా పింఛన్లకు అర్హులైన వారు సచివాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన వారికి రేషన్ కార్డు, పింఛన్లు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు పూనెం సత్యనారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి శివ ప్రసాద్, సచివాలయం సిబ్బంది బుచ్చిరాజు, అంగన్వాడీ కార్యకర్త, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జిఓ 117 రద్దుకు ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి- తగరపువలస: మున్సిపల్, పాఠశాల విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే జిఓలు 117, 84 జిఒలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జివిఎంసి పరిధిలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు.ఎపి మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జివిఎంసి ప్రాథమిక, ఉన్నత, విల్సన్‌పేట, సంగివలస కాలనీ పాఠశాలల వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎపి, ఎంటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ అమర్నాథ్, భీమిలి పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి దుర్గాప్రసాద్, వై ప్రతాప్‌సింగ్, కోశాధికారి కె లీలామణి, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.రమేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ కె ఇందిర పాల్గొన్నారు

నేత్రదానంపై రేడియో ప్రసంగం

- నేడు ఉదయం 7.15గంటలకు ప్రసారం

డాక్టర్ మోహనప్రీతితో కార్యక్రమం నిర్వహిస్తున్న ఆకాశవాణి ప్రతినిధి దిలీప్

ప్రజాశక్తి- సీతమ్మధార: నేత్రదానం ఆవశ్యకత, ప్రజల్లో అవగాహనకు ఆల్‌ఇండియా రేడియో (ఆకాశవాణి)లో ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల కార్నియా కన్సల్టెంట్ డాక్టర్ మోహనప్రీతి ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడారు. బుధవారం 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలలో భాగంగా జిల్లా అంధత్వ నివారణా సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆకాశవాణి ప్రతినిధి దిలీప్ పాల్గొని,సామాన్య ప్రజలకు నుంచి వచ్చే అనేక సందేహాలను డాక్టర్ మోహనప్రీతి ద్వారా శ్రోతలకు అర్థమయ్యేలా సమాధానాలను చెప్పి, వివరించారు. ఈసందర్భంగా నేత్రదానం అంటే ఏమిటి? ఎవరికి, ఎవరెవరు నేత్రదానం చేయొచ్చు, ఎలా,ఎప్పుడు చెయ్యాలనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమం రేడియోలో శుక్రవారం ఉదయం 7:15 గంటలకు ఆరోగ్యమే మహాభాగ్యం కార్యక్రమంలో భాగంగా ప్రసారమౌతుందని, శ్రోతలందరూ విని, నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

అత్యవసర సమావేశాలకొస్తే టిఎ, డిఎ చెల్లించాలి

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ

మారేడుమిల్లి పిహెచ్‌సి వద్ద ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఆశా వర్కర్లకు టీఏ, డీఏలు కల్పించకుండా సమయపాలన లేని జూమ్ మీటింగులకు పిలవటం సరికాదని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ల వాణిశ్రీ అన్నారు. మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం ఆశావర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెల ఆశ "డే" సబ్ సెంటర్ మీటింగులకు మాత్రమే ఆశవర్కర్లు హాజరు అవ్వాలని మిగతా ఏ అత్యవసర మీటింగులు పెట్టినా కచ్చితంగా టిఏ, డిఏలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంత భౌగోలిక పరిస్థితులను ఏమాత్రం పట్టించుకోకుండా, ఆశా వర్కర్ల ఆర్థిక పరిస్థితులు అర్థం చేసుకోకుండా ఇలాంటి అత్యవసర జూమ్ మీటింగులు ఎందుకు పెడుతున్నారని, ఎవరు ఇలాంటి నిర్ణయాలు చేస్తున్నారో ఆ ఆలోచన నీ వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ మధ్య కాలంలో ఆశవర్కర్లపై కొన్ని పిహెచ్సిలలో మెడికల్ ఆఫీసర్ల, ఇతర సిబ్బంది వేధింపులు ఎక్కువగా ఉన్నాయని, వెంటనే అడిషనల్ డి ఎం అండ్ హెచ్ ఓ వీటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. మారేడుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ హరికృష్ణ ఆశవర్కర్లపై దురుసుగా ప్రవర్తిస్తున్న తీరును ఆశావర్కర్స్ యూనియన్ తీవ్రంగా ఖండిస్తుందని, ఆయన తీరును మార్చుకోకపోతే రంపచోడవరం 18 పిహెచ్సిల ఆశవర్కర్లందరూ మారేడుమిల్లి పిహెచ్సి ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమస్యల పరిష్కారానికై సెప్టెంబర్ 3వ తారీఖున అన్నీ పిహెచ్సీలలో జరిగే ఆశ డే రోజు ఆశవర్కర్లందరూ ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు.

మూల కణాల దానంతో ప్రాణదాతలు కండి!

గీతం వర్సిటీ అధ్యక్షుడు, విశాఖ ఎంపీ శ్రీభరత్

విశాఖకు చెందిన స్టెమ్‌సెల్ దాత గణపతిరావును అభినందిస్తున్న శ్రీభరత్

ప్రజాశక్తి -మధురవాడ : బ్లడ్ కేన్సర్, రక్తహీనత వంటి ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతున్న వారికి కొత్త జీవితం ఇవ్వడానికి, ప్రాణదాతలుగా మారడానికి ఆరోగ్యకరమైన వ్యక్తులు స్టెమ్‌సెల్ (మూలకణం) దాతలుగా ముందుకు రావాలని విశాఖ ఎంపీ ఎమ్.శ్రీభరత్ పిలుపునిచ్చారు. బుధవారం గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్‌సర్)లో దేశంలో స్టెమ్‌సెల్ దాతల వివరాలను నమోదు చేసే అతి పెద్ద స్వచ్ఛంద సంస్థ 'ధాత్రి బ్లడ్ స్టెమ్‌సెల్ డోనర్స్ రిజిస్ట్రీ' నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడుతూ,. ఆపదలో ఉన్నవారిని ఆదుకుని, ప్రాణం పోసే అరుదైన అవకాశం వదులుకోవద్దనికోరారు. స్టెమ్‌సెల్ అవసరం ఉన్న వారి సంఖ్య కంటే దాతల సంఖ్య దేశంలో అతి తక్కువగా ఉండటం విచారకరమన్నారు. గీతం విద్యార్థులు స్వచ్చంధంగా ముందుకు వచ్చి దాతలుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ధాత్రి సంస్థ ద్వారా స్టెమ్‌సెల్ దాతగా మారుతూ, తన వివరాలను నమోదు చేయించుకున్నారు. న్యూఢిల్లీకి చెందిన అర్పిత్‌జైన్ అనే యువకుడికి బ్లడ్ స్టెమ్‌సెల్ దానం చేసి ప్రాణాలు నిలిపిన విశాఖ యువకుడు గణపతిరావును అభినందించి జ్ఞాపికను అందజేశారు.

ధాత్రి సంస్థ దక్షిణ భారత విభాగం అధిపతి అభయ్ శ్యామ్‌జాన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా 33 మిలియన్ల మంది స్టెమ్ సెల్ దాతలు ఉండగా, దేశంలో కేవలం 6 లక్షల మంది దాతలు మాత్రమే ఉన్నారన్నారు. 2007లో ప్రారంభమైన తమ సంస్థలో ఇప్పటి వరకు వివిధ రాష్ట్రాల నుంచి 5.6 లక్షల మంది, విశాఖ నుంచి 500 వందల మంది స్టెమ్‌సెల్ దాతలుగా పేర్లు నమోదుచేయించుకున్నారని తెలిపారు. 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు గల ఆరోగ్యవంతులు ఎవరైనా దాతలుగా మారవచ్చునని వెల్లడించారు. విశాఖకు చెందిన ప్రముఖ జాతీయ క్రికెట్ క్రీడాకారుడు కె.ఎస్.భరత్ ధాత్రి సంస్థ సేవా భావాన్ని కొనియాడారు. సంస్థ దాతలలో ఒకడిగా ఉంటానని ముందుకు వచ్చారు. జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, జిమ్‌సర్ డిన్ డాక్టర్ ఎస్.పి.రావు, ధాత్రి సంస్థ ప్రతినిధులు రాణా పాల్గొన్నారు.

లోకేష్ పర్యటనను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి -గాజువాక: విశాఖలో రాష్ట్ర ఐటి, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పర్యటనను విజయవంతం చేయాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం పాత గాజువాక టిడిపి కార్యాలయం ఆవరణలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో పల్లా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మంత్రి హోదాలో విశాఖకు వచ్చే లోకేష్‌కు ఘనస్వాగతం పలికేందుకు కూటమి పార్టీల కేడర్ పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకువెళ్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ కార్పొరేటర్లు రౌతు శ్రీనివాస్, బొడ్డు నరసింహ పాత్రుడు, మొల్లి ముత్యాల నాయుడు, రాజాన రామారావు, పులి రమణారెడ్డి, పప్పు శంకరరావు, పాలేటి పెంటారావు, గొర్లె వెంకునాయుడు, శివప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 'అభయ ఘోష' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి 'అభయ ఘోష' ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తున్న కెజిహెచ్ రేడియాలజీ హెచ్‌ఒడి

ప్రజాశక్తి- విశాఖపట్నం : మహిళా వైద్యులు భద్రత తదితర అంశాలతో ప్రజాశక్తి 'అభయఘోష' పేరుతో ప్రచురించిన ప్రత్యేక సంచికను బుధవారం కెజిహెచ్‌లో ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుజ్జిబాబు, ఇన్‌ఛార్జి డాక్టర్ స్వర్ణ, జూనియర్ వైద్యులు, నర్సులు, కేన్సర్, మెడికల్, ఫార్మశీ విభాగం ఇన్‌ఛార్జిలు వనజాక్షి, రితిక్, దుర్గాదేవి, మానస, చాందిని, సతీష్, పూజిత తదితరులు పాల్గొని, అభయ ఘోష ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు, ఈ సందర్భంగా రేడియాలజీ హెచ్‌ఒడి డాక్టర్ బుజ్జిబాబు మాట్లాడుతూ,. రేయింబవళ్ళు రోగులకు వైద్యసేవలు అందించే వైద్యులకు పనిప్రదేశంలో, ఆసుపత్రిలో రక్షణ కరువైతే అంతకన్నా దారుణం మరొకటి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యులతో పాటు ఇతర శాఖల్లో పనిచేసే మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వాలపైనే ఉందన్నారు. వైద్యులు, సిబ్బందికి పటిష్టమైన రక్షణ కల్పించాలని కోరారు. వీరిజోలికి వెళితే కఠినశిక్షలకు గురికాక తప్పదనే హెచ్చరికలు, అవగాహన అందరిలోనూ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో మహిళావైద్యులు విధుల్లో ఉన్నప్పుడు ఆసుపత్రికి వచ్చిపోయే వారిపై పటిష్టమైన రక్షణ, సిసి కెమెరాల నిఘా పెట్టాలని కోరారు. వైద్యులు ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించి తగు చర్యలు తీసుకునేలా వ్యవస్థలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు వైద్యసేవలు అందిస్తూ ఆరోగ్య ప్రదాతలుగా నిలిచే వైద్యులు, సిబ్బంది రక్షణకు ప్రభుత్వాలు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

సిఐగా దుర్గాప్రసాద్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు సబ్ డివిజన్ పరిధి చింతూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా తెల్లం దుర్గాప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇదే డివిజన్లో విఆర్ పురం ఎస్సైగా పని చేసిన దుర్గాప్రసాద్ సీఐగా ఉద్యోగోన్నతి పొంది రాజమహేంద్రవరం వెళ్లారు. రాజమహేంద్రవరం సిఐడి డిపార్ట్మెంట్లో పనిచేస్తూ బదిలీపై చింతూరు సీఐగా వచ్చి బాధ్యతలు తీసుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న దుర్గాప్రసాద్

శారదా పీఠానికి కేటాయించిన భూమిని వెనక్కు తీసుకోవాలి

ప్రజాశక్తి -భీమునిపట్నం : పేదలకు సెంటుభూమి ఇవ్వడానికి మీనమేషాలు లెక్కించిన గత వైసిపి ప్రభుత్వం భీమిలి కొండపై 15 ఎకరాల విలువైన భూమిని శారదాపీఠానికి కేటాయించిందని, దాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని తెలుగు శక్తి అధ్యక్షులు బి వి రామ్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని వైసిపి అగ్ర నేతలు, ఆ పార్టీ ఉత్తరాంధ్ర ఇన్చార్జిలుగా చెలామణి అయిన ప్రముఖులు విశాఖ, భీమిలి తీరంలో విలువైన భూములను కాజేశారని ఆరోపించారు. భూఆక్రమణలు, దందాలపై విశాఖ పర్యటనకు వస్తున్న టిడిపి యువనేత, రాష్ట్రమంత్రి నారా లోకేష్ దృష్టి పెట్టాలని సూచించారు.

ఎయు ప్రతిష్టను మసకబార్చేలా పూర్వ విసి ప్రసాదరెడ్డి హయాంలో తీసుకున్న అన్ని నిర్ణయాలపై మంత్రి లోకేష్ పున:సమీక్షించి, ఆంధ్రాయూనివర్సిటీ గౌరవాన్ని నిలిపే తగు చర్యలు చేపట్టాలని కోరారు.సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ఎం సంజీవ్‌కుమార్, డాక్టర్ పప్పూర్ నికుంజ్, జి పోలిరాజు, కొక్కిరి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.